ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 12 నవంబరు 2024



టీపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం

సిరిసిల్ల రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ ప్రకటించారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా దుమాల రాంనాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా విక్కుర్తి అంజయ్య, రాష్ట్ర కౌన్సిలర్లుగా దోర్నాల భూపాల్‌రెడ్డి, సత్తు రవీందర్, సంగెం మాలతి, ఉపాధ్యక్షులుగా పురం వాసుదేవరావు, దేవిరెడ్డి, హనుమంత్‌రెడ్డి, దబ్బెడ హనుమాన్లు, మందాడి శ్రీనివాస్‌రెడ్డి, నూగురి దేవేందర్, కేవీ రజనీరాణి, జిల్లా కార్యదర్శులుగా పర్వతి తిరుపతి, తాళ్లపల్లి శ్రీధర్, మైలారం తిరుపతి, రామచంద్రం, ఎడ్ల కృష్ణచైతన్య, రజిని ఎన్నికయ్యారు.

న్యూస్ బాక్స్

కొనసాగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడిపేట మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉదయం ఆలయ అర్చకుడు నవీన్‌చారి ఆధ్వర్యంలో దివ్య ప్రబంధ సేవాకాలం, నివేదన పరమ పదోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 13న స్వామివారి కల్యాణం, 15న రథోత్సవానికి ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

అన్యాయంపై బీసీలు ప్రశ్నించాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యా, ఉద్యోగ, చట్ట సభల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాలను ప్రశ్నించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పర్శరాములు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలో జరిగిన సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధిగా కోరుట్ల రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా గాజుల మోహన్ నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ సంఘం నాయకులు, కార్యవర్గ సభ్యులు గ్రామా గ్రామాన బీసీలను చైతన్య పరచాలని అన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాలలో కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లు పెట్టి బీసీలకు విద్యా, ఉద్యోగ, చట్టసభలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు బిల్లా వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి గోపిగౌడ్ పాల్గొన్నారు.

తప్పుతున్న లెక్క



- వివరాలు చెప్పడానికి అనాసక్తి
- కుటుంబాల వారిగా వేయని స్టిక్కర్లు
- ప్రజల్లో అవగాహన కరువు
- సర్వేలో సమగ్రత కష్టమే
- జిల్లాలో నత్తనడకన సమగ్ర సర్వే

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నెమ్మదిగా సాగుతోంది. క్షేత్ర స్థాయిలో ఎన్యూమరేటర్లకు ఎదురు ప్రశ్నలు తలనొప్పిగా మారుతున్నాయి. వివరాలు చెప్పేందుకు ప్రజలు అనాసక్తి కనబరుస్తున్నారు. పొడి పొడిగా సమాధానం ఇస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం చేసిన సర్వే ఏమైందని కొందరు ప్రశ్నిస్తే మరికొందరు ఆస్తుల వివరాలు చెబితే ఎక్కడ ఇబ్బంది వస్తుందోనని భయపడుతున్నారు. కుటుంబ సభ్యుల వివరాలు చెప్పడానికి, ఆధార్ కార్డులు చూపడానికి కూడా ఇష్టంలేక ఎన్యూమరేటర్లను ఇబ్బంది పెడుతున్నారు. దీంతో సర్వేలో సమగ్ర లెక్క తప్పుతుందని భావిస్తున్నారు. అధికారులు మాత్రం కుటుంబాల సంఖ్య వివరాలు పక్కాగా ఉండాలని ఆదేశిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం వివరాల సేకరణ నత్తనడన సాగుతోంది. ప్రజలు ఆస్తుల వివరాలు ఎందుకు అంటూ ఎన్యూమరేటర్లను ఇబ్బంది పెడుతున్నారు. పిల్లల వివరాలు కూడా సక్రమంగా చెప్పడం లేదు.

మిగతా 8వ పేజీలో..

జిల్లాలో 1,92,432 కుటుంబాలకు సంబంధించి ఒక ఎన్యూమరేటర్ ప్రతీ రోజు కనీసం 15 నుంచి 20 కుటుంబాల వివరాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. సర్వే ఫారంలో 75 ప్రశ్నలు ఉన్నాయి. కోడింగ్ పద్ధతి ఉండడంతో కనీసం ఒక కుటుంబం వద్ద 30 నిముషాల వరకు సమయం పడుతోందని ఎన్యూమరేటర్లు చెబుతున్నారు. జిల్లాలో గడిచిన మూడు రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో 21,913 కుటుంబాలు, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో 9970 కుటుంబాల వివరాలు మాత్రమే సర్వే చేశారు. సర్వే చేసిన వివరాలను ప్రతీ రోజు ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా ప్రభుత్వం నుంచి సాఫ్ట్‌వేర్ వివరాల నమోదుపై ఆదేశాలు రాకపోవడంతో ఆన్‌లైన్ ప్రక్రియ మొదలు కాలేదు. సర్వే చేసిన పత్రాలు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల వద్ద ఉన్నాయి. ప్రభుత్వం నుంచి సాఫ్ట్‌వేర్ వచ్చిన వెంటనే ఆన్‌లైన్ చేసే విధంగా జిల్లాలో ఆపరేటర్లను సిద్ధం చేసుకొని అధికారులు సిద్ధంగా ఉన్నారు.

మొదలుకాని ఆన్‌లైన్ ప్రక్రియ

సర్వే సాగింది ఇలా...

9వ తేదీ	సర్వే కుటుంబాలు
గ్రామాలు	3438
పట్టణాలు	1415
10వ తేదీ	సర్వే కుటుంబాలు
గ్రామాలు	7827
పట్టణాలు	4027
11వ తేదీ	సర్వే కుటుంబాలు
గ్రామాలు	10648
పట్టణాలు	4528

వ్యక్తిగత సమస్యలతోనే ఆత్మహత్యలు

- చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్

సిరిసిల్ల నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో కార్మికులు వ్యక్తిగత సమస్యలతోనే ఆత్మహత్య చేసుకున్నారని, మరణాలకు సంబంధించి వృత్తి పరమైన ఇబ్బందులు కారణం కాదని చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్ తెలిపారు. 'భరోసా ఏదీ' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత సమగ్ర శిక్ష, వెల్ఫేర్ శాఖలకు సంబంధించిన వస్త్రోత్పత్తి ఆర్డర్లు కేటాయించినట్లు తెలిపారు. సిరిసిల్లలోని మరమగ్గాలకు 48.69 లక్షల మీటర్ల వస్త్రాల ఆర్డర్లు, టెక్స్‌టైల్ పార్కులో 49.94 లక్షల మీటర్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు కేటాయించామని పేర్కొన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలోని మహిళా సంఘాల్లో 63 లక్షల మంది సభ్యులకు సుమారు 8 కోట్ల మీటర్ల వస్త్ర ఉత్పత్తితో ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ చీరలను సిరిసిల్లలోని మరమగ్గాల ద్వారా ఉత్పత్తి చేయించాలని, దాని ద్వారా కార్మికులకు ఉపాధి కల్పించాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం మరమగ్గాలకు పది హెచ్‌పీలకు వరకు ఉన్న విద్యుత్ రాయితీని 25 హెచ్‌పీలకు పెంచుతూ నిర్ణయం తీసుకుందని తెలిపారు.

మున్సిపల్ చైర్ పర్సన్ కళా చక్రపాణికి సన్మానం

సిరిసిల్ల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని వైకుంఠ ధామాల్లో రూ.101తో దహన సంస్కారాలకు నిర్వహించేందుకు కృషి చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణిని సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిరిసిల్ల పౌర సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. చైర్ పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజయ్య, సహాయ కార్యదర్శి కుసుమ గణేష్ నాయకులు పాల్గొన్నారు.

బ్లాక్‌లో కోడె టికెట్ల దందా

వేములవాడ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో కోడె టికెట్ల దందా మరోసారి బయటపడింది. కార్తీ మాసం సోమవారం కావడంతో రాజన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. కోడె టికెట్ల కోసం సుమారు 4 గంటల నుంచి 5 గంటల వరకు క్యూలైన్‌లో నిరీక్షించారు. ఇదే అదునుగా భావించిన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలానికి చెందిన రమేష్, సిరిసిల్ల జిల్లా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఆలయ పరిసరాల్లో బ్లాక్‌లో కోడె టికెట్లు విక్రయిస్తుండగా ఎస్పీఎఫ్ సిబ్బంది కంటపడ్డారు. దీంతో సిబ్బంది వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.



గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం

- వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్

ఆలయంలో ప్రత్యేక పూజల్లో మంత్రి పొన్నం

6



మాజీ సర్పంచుల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్

కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న మాజీ సర్పంచులు

6



అసమానతలకు వ్యతిరేకంగా

రంగవల్లి పోరాటం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- వేములవాడలో విజ్ఞాన కేంద్రం ప్రారంభం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

7

గ్రీవెన్స్ డేతో బాధితులకు సత్వర న్యాయం



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 17 పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను ఆదేశించామన్నారు. భూ, ఆస్తి తగాదాల విషయంలో చట్ట ప్రకారం సత్వర న్యాయం అందించే విధంగా చూడాలన్నారు. గ్రీవెన్స్‌డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్తులపై కఠిన వైఖరి అవలంబిస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

ఇల్లంతకుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలలో సమగ్ర కుటంబ సర్వే సోమవారం కొనసాగింది. వెంకట్రావుపల్లె గ్రామానికి జిల్లా స్థాయి అధికారులు వచ్చి నచ్చజెప్పినా గ్రామస్తులు మాత్రం పట్టువీడలేదు. దీనితో ఎన్యుమరేటర్లు నాలుగురి వద్ద నుండి కుటుంబ వివరాలు సేకరించారు. తిప్పాపూర్, జంగమరెడ్డిపల్లె, రంగపేట గ్రామాలలో జరుగుతున్న సర్వేను ఎంపీడీఓ శశికళ పరిశీలించి పలు సూచనలు చేశారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్/వేములవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతికి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమర యోధుడు, భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ విద్యా వ్యవస్థ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు అనితర సాధ్యమన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి జీవితంలో ముందుకు పోయేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం పాఠశాలలో వంటగదిని, నిత్యావసర వస్తువులను పరిశీలించారు.



నివాళులర్పిస్తున్న ఆది శ్రీనివాస్



నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అధికారులు

జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి కలెక్టర్, అదనపు కలెక్టర్ నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ విద్యా వ్యవస్థ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేములవాడ, సిరిసిల్ల ఆర్డీవోలు రాజేశ్వర్, వెంకట్ ఉపేందర్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాధాబాయ్, ఓఎస్డీ సర్వర్ మియా, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలి



మాట్లాడుతున్న చైర్ పర్సన్ కళాచక్రపాణి

సిరిసిల్ల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, బాలికలు ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం గీతనగర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో త్రివర్ణ సంకల్పశక్తి ఆధ్వర్యంలో ది షీల్డ్ మిషన్ సురక్ష కార్యక్రమంలో భాగంగా ఉచిత ఆత్మరక్షణ శిబిరాన్ని చైర్ పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో చీడ పురుగులు కొందరు మహిళలు, యువతులు, బాలికలపై దాడులు చేస్తున్నారని, అలాంటి వారిని ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. చీడ పురుగులకు బుద్ది చెప్పడానికి ప్రతీ ఒక్కరు ఆత్మరక్షణ విద్యను నేర్చుకోవాలన్నారు. బాలికలు గుడ్ టచ్, బాడ్ టచ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఉచిత ఆత్మరక్షణ విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని శారద, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు ఆడెపు చంద్రకళ, ది షీల్డ్ మిషన్ సురక్ష శిక్షకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలి

సిరిసిల్ల క్రైం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ఏవైనా సంఘటనలు జరిగితే ఉన్నతాధికారులకు వెంటనే తెలిపేలా సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. పోలీసు శాఖ వినియోగిస్తున్న టెక్నాలజీపై అధి కారులకు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. డయల్ 100కు కాల్ రాగానే వెంటనే స్పందించాలని, సమస్య పరిష్కా రానికి కృషి చేయాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై నిఘా కఠినతరం చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై వేయాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో 5ఎస్ అమలు చేసిన తీరును పరిశీలించారు. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్సైలు ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

సుల్తానాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన వీరగోని అనిల్ అనే వ్యక్తి తన భార్యపై చేయి చేసుకోగా ఆ విషయాన్ని బాధితురాలు తన తల్లితండ్రులకు చెప్పుకుంది. బాధితురాలి తండ్రి, సోదరులు కాట్నపల్లి చేరుకుని ఈ విషయమై అనిల్‌ను ప్రశ్నించగా అనిల్ తన మామ, బావమరిదిపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితుల పిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సోమవారం అనిల్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించామని తెలిపారు.

మట్టి టిప్పర్ పట్టివేత

సుల్తానాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను సోమవారం పట్టుకున్నామని ఎస్ఐ శ్రావణ్ తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా మట్టి తరిస్తున్న టిప్పర్ పట్టుబడిందని, కరీంనగర్ జిల్లా చొప్పదండి ప్రాంతం నుంచి మట్టిని కాట్నపల్లి వైపు మట్టిని తరలిస్తున్నారన్నారు. టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించామని ఎస్ తెలిపారు.

జ్వరంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

ఓదెల నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని పిట్టల ఎల్లయ్యపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ ఎలువాక శారద (35) సోమవారం జ్వరంతో మృతి చెందింది. పిట్టల ఎల్లయ్యపల్లిలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహించే శారదకు పది రోజుల క్రితం తీవ్రజ్వరం రావడంతో కరీంనగర్ లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

కారు, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

శంకరపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలం మొలంగూర్ బీసీ కాలనీలో బైక్‌ను కారు ఢీ కొన్న ఘటనలో చింతలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపల్లి గ్రామానికి చెందిన మునిగంటి అయిలయ్య బైక్‌పై వెళుతుండా మొలంగూర్ బీసీ కాలనీ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో అయిలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ధర్మపురిలో చోరీ

ధర్మపురి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ రోడ్ సమీపంలో ఎలిగేటి లక్ష్మణ్ అనే వ్యక్తి ఇంటిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి ఇంటి తాళాలు పగుల గొట్టి లోనికి ప్రవేశించారు. అనంతరం ఇంటిలో గల ఆరుతులాల బంగారు ఆభరణాలు, రూ 20వేలు నగదు అపహరిం చారు. జగిత్యాల నుంచి చేరుకున్న క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిం చారు. బాధితుడు లక్ష్మణ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చుట్టూ పచ్చని చెట్లు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం. ఎత్తైన కొండ మీద సోమేశ్వర దేవాలయం. ఇవన్నీ భక్తులను కట్టిపడేస్తున్నాయి. చుట్టు పక్కల ప్రాంతాలే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా స్వామి దర్శనం కోసం పెద్ద ఎత్తున భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. శ్రావణ, కార్తీక మాసాల్లో భక్తుల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. కానీ భక్తులకు కనీస సౌకర్యాలు మాత్రం కరువు అనే చెప్పాలి. స్వామి వారు ఎత్తైన గుట్టపైన ఉండడంతో భక్తులు ఎక్కేందుకు సరైన రహదారి సౌకర్యం లేదు. ఘాట్ రోడ్డు నిర్మాణం చేపడుతామని ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా అది అమల్లోకి మాత్రం రావడం లేదు. దీంతో భక్తుల కాష్టాలు అలానే కొనసాగుతున్నాయి.



మల్లాపూర్ సోమేశ్వరకొండ ఆలయంలో భక్తులు(ఫైల్)

ప్రకృతి అందాల మధ్య..
సోమేశ్వర గుట్ట

- నిత్యం వేల సంఖ్యలో భక్తుల రాక..
- ఘాట్ రోడ్డు సౌకర్యం లేక భక్తుల ఇక్కట్లు



మల్లాపూర్ సోమేశ్వరకొండపైకి మెట్ల గుండా వెళ్లుతున్న భక్తులు

మల్లాపూర్, నవంబరు, 11 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఎత్తైన కొండమీద ప్రకృతి అందాల మధ్య ఉన్న కనక సోమేశ్వర స్వామి భక్తులను ఆకట్టుకున్నాడు. కోరిన కోరికలు తీర్చే స్వామిగా,పురాతన పుణ్యక్షేత్రంగా కొండపై ఆలయ నిర్మాణం చేపట్టారు. ప్రతి ఏటా శివరాత్రి, కార్తీక, శ్రవాణ మాసాల్లో సమయంలో దేవాలయంలో ఘనంగా జరిగే ఉత్సవాలకు పలు జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన కొండపైకి చేరుకుంటారు. ముఖ్యంగా కార్తీక మాసంలో ఎక్కువగా శివుడికి దీపాలు వెలిగించి స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారు భక్తులు. అయితే ఇంత మంది భక్తులు వస్తున్నా వారికి కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. కొండపైన ఉన్న స్వామి వద్దకు వేళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడం గమనార్హం. మట్టి రోడ్డు గుండా భక్తులు కొండ పైకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై గ్రామానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినా వేయిస్తామని చెప్పి స్వామి వారిని దర్శించుకుంటారు. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇవ్వడమే కానీ గెలిచిన తరువాత ఇచ్చిన హామీలు మాత్రం నెరవేర్చడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు అధికారులు రోడ్డు నిర్మాణం కోసం అంచనా అంటూ తూతూ మంత్రంగా పరిశీలన చేస్తుంటారే గానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడడం లేదు.

నిధులు మంజూరైనా..

అసెంబ్లీ ఎన్నికల ముందుకు టీటీడీ డైరెక్టర్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆలయ అభివృద్ధి పనుల కోసం పది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరై సంవత్సరం గడుస్తున్నా ఘాట్ రోడ్డు నిర్మాణం మాత్రం జరగలేదు. నిధులు మంజూరు కావడం ఆ వెంటనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనుల ప్రారంభోత్సవానికి వేసిన శిలాఫలకం వరకే ఆగిపోయింది. ఆ తరువాత కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ఇకదాని ఊసే లేకుండా పోయింది. దీంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు దృష్టి సారించి ఆలయ ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి..



స్వామి దర్శనం కోసం కొండపైకి వస్తుంటాము. ముఖ్యంగా శ్రావణ, కార్తీక మాసంలో బ్రహ్మ మూర్తంలో స్వామి వారిని దర్శించుకుంటాము. కుటుంబ సభ్యులంతా కలిసి వస్తాము. కానీ ఇంతగా భక్తులు వస్తున్నా సౌకర్యాలు మాత్రం అందుకు తగ్గట్టుగా లేవు. కొంగపైకి ఎక్కేందుకు భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వయసు పై బడిన వారు కొండపైకి ఎక్కలేకపోతున్నారు. ఇబ్బందులు లేకుండా రోడ్డు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- ర్యాగేళ్ల మనీషా, మొగిలిపేట భక్తురాలు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఎన్నికల్లో నాయకులు ఇచ్చిన హామీల్లో భాగంగా ఆలయానికి ఘాటు రోడ్డు నిర్మాణం. చేపట్టాలి. కోరిన కోరికలు తీర్చే అతి పురాతన ఆలయంగా ఏళ్ల క్రితం వెలిసినప్పటి స్వామి వారి దర్శనం కోసం ఇతర జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు దృష్టి సారించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

- శివ శ్రీనివాస్, మల్లాపూర్ భక్తుడు

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం

- వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కార్తీక సోమవారం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేటీఆర్ కాంగ్రెస్ బీసీలకు ఏం చేసిందని ప్రశ్నించారని, అసలు బీసీల గురించి మాట్లాడే అర్హత ఉందా? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. కేటీఆర్ బీసీల గురించి మాట్లాడాలంటే ఆ పార్టీ అధ్యక్ష పదవి, కార్యనిర్వాహక పదవి, ప్రతిపక్ష పదవులను బీసీ, ఎస్సీలకు ఇవ్వాలన్నారు. ఒక్కటి ఇచ్చినా మాట్లాడే అర్హత ఉంటుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారని, కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని ఆరోపించారు. ఆ వివరాల కోసం విచారణ చేయిస్తామని, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న ఈ కుల సర్వే దేశ వ్యాప్తంగా జరగాలని డిమాండ్ వస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ సర్వేను అక్కడక్కడ అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతీ తెలంగాణ పౌరుడు సహకరించాలన్నారు. సర్వే ఇబ్బంది పెట్టేందుకు, బలహీన వర్గాలకు మాత్రమే పరిమితమైంది కాదని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక దిక్సూచి అవసరాల కోసం తీసుకుంటున్న సమాచారమని స్పష్టం చేశారు. ఎన్యూమరేటర్లకు సవచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే వాఖ్యలకు ప్రభావితం కావద్దని కోరారు. అంతకుముందు రాజన్న ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ పూలమొక్కతో స్వాగతం పలికారు. కాగా పోలీసులు ఏర్పాటు చేసిన గౌరవవందనాన్ని స్వీకరించారు. సోమవారం తెల్లవారు జామున రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



వేములవాడలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గంభీరావుపేటలో గంగపుత్రుల రాస్తారోకో



గంభీరావుపేటలో రాస్తారోకో చేస్తున్న గంగపుత్రులు

గంభీరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద సోమవారం రాత్రి గంగపుత్రులు రాస్తారోకో చేపట్టారు. చేప పిల్లలు పంపిణీ చేస్తామని మత్స్యశాఖ అధికారులు లింగన్నపేట సెంటర్‌కు రమ్మని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. గతంలో ఈ సమయానికి మానేరులో, చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేశామని, ఈ ఏడు చేప పిల్లలు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. లింగన్నపేట సెంటర్ వద్ద పొద్దంతా తిండి తిప్పలు లేక ఉంటే, చేప పిల్లలు ఇవ్వకుండా తిరిగి పొమ్మనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గంటల తరబడి ఆందోళన చేయడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో పోలీస్‌లు అక్కడకి చేరుకుని గంగపుత్రులను సముదాయించారు.

మాజీ సర్పంచుల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన మాజీ సర్పంచులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాజీ సర్పంచుల ఫోరం జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రికత్తకు దారి తీసింది. పెండింగ్ బిల్లులు చెల్లించాలని శాంతియుతంగా నెల రోజులు రిలే దీక్షలు, ఆందోళనలు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో మాజీ సర్పంచులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. 2019 నుంచి 2024 వరకు ఉన్న పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ఫ్లకార్డులు ప్రదర్శించారు.

రగుడు జంక్షన్ నుంచి ర్యాలీగా తరలి రావడంతో కలెక్టరేట్ ఎదుట పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టర్‌ను కలుస్తా మంటూ దూసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. వినిపించుకోకుండా కలెక్టరేట్‌లోకి పరుగు తీయడంతో పోలీసులు గేట్‌లను మూసివేశారు. ఆగ్రహించిన మాజీ సర్పంచ్‌లు అక్కడే బైఠాయించారు. డీఎస్పీ చంద్ర శేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కృష్ణ ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతుండగానే కొందరు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకొని మాజీ సర్పంచ్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్‌లను పోలీసు వాహనాలల్లో కలెక్టరేట్‌లోకి తీసుకురాగా వారు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతి పత్రాన్ని అంజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పం చులు మాట్లాడుతూ గ్రామాల్లో రైతు వేదికలు, శశ్మాన వాటికలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, మిషన్‌భగీరథ పనులు, సీసీరోడ్లు, మురికికాలువలతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినా బిల్లులు రాలేదని, వాటికోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, ఉపాధ్యక్షులు గణప శివజ్యోతి, చాకలి రమేష్, బొజ్జం మల్లేశం, కోల నర్సయ్య, వంశీకృష్ణరావు, గున్నాల లక్ష్మణ్, చల్లనారాయణ, బూర్గుల నందయ్య, పోన్నాల మల్లారెడ్డి పాల్గొన్నారు.

- కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లుల కోసం ఆందోళనలు చేస్తుండడంతో పోలీసులు గేట్లను మూసివేశారు. కలెక్టరేట్‌లో ప్రజావాణిలో పాల్గొనేందుకు వచ్చిన జిల్లా అధికారులతో పాటు ప్రజలను అనుమతించకపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసిన అనంతరం జిల్లా అధికారుల ఐడీ కార్డులను చూసి పంపించారు. దీంతో అధికారులతోపాటు ప్రజలు గంటల తరబడి నిరీక్షించారు.

క్రైం కార్నర్

తండ్రి కడసారి చూపు కోసం..

- ఐదు రోజులుగా ఫ్రీజర్‌లోనే కూతురు మృతదేహం
- బెయిల్ ఇవ్వని కోర్టు

సారంగాపూర్, నవంబరు. 11 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల జిల్లా రేచిపల్లి గ్రామానికి చెందిన పోగుల రాజేశం మల్లీశ్వరి కూతురు లత అనుమానాస్పద స్థితిలో నిర్మల్ జిల్లా, దస్తూరాబాద్ మండలం, రేగోజీపేట గ్రామంలో ఐదు రోజుల క్రితం మృతి చెందగా ఆమె మృతదేహం తండ్రి కడసారి చూపు కోసం ఫ్రీజర్‌లోనే ఉంచారు. లత గత శుక్రవారం అత్తింట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. లత తండ్రి రాజేశం 9నెలలుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగ్దల్‌పూర్ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. మావోయిస్టులకు సహకరిస్తున్నాడనే అనుమానంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. రాజేశం విడుదల కోసం పౌరహక్కుల నేతలు మాదన కుమారస్వామి, సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి అక్కడి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా ఎన్ఐఏ కోర్టు బెయిల్ మంజూరు చేయక పోవడంతో భార్య మల్లీశ్వరి పుట్టెడు దుఃఖంతో తిరుగు ప్రయాణం అయ్యారు. మంగళవారం లత అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

వీర్నపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మానసిక వైకల్యంతో బాధపడుతున్న గిరి జనుడు వ్యవసాయ మోటారు వద్ద ఏర్పాటు చేసిన స్టార్టర్ విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామపరిధి కేలోత్ తండాలో ఆదివారం అర్ధ రాత్రి చోటు చేసుకున్న సంఘటన వివ రాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అజ్మీరా రెడ్డి (57) ఆదివారం రాత్రి తన సోదరుడి పొలం వద్ద ఉన్న స్టార్టర్ ఆఫ్ చేయడానికి వెళ్లాడు. స్టార్టర్ ఆఫ్ చేస్తుండగా అక్కడ పైకి తేలి ఉన్న సోలార్ విద్యుత్ తీగలకు చేయి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికు లు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఆసు పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అజ్మీరారెడ్డి మానసిక స్థితి సరిగా లేక సోదరుడు రమేష్‌తో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. రమేష్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్లాగౌడ్ తెలిపారు.

జిన్నింగ్ మిల్లులో చెలరేగిన మంటలు



మంటలు చల్లార్చుతున్న అగ్నిమాపక సిబ్బంది

జమ్మికుంట రూరల్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో గల మురుగన్ ఇండస్ట్రీస్ (జిన్నింగ్ మిల్లు)లో సోమవారం మంటలు చెలరేగాయి. జిన్నింగ్ చేస్తుండగా యంత్రంలో వచ్చిన చిన్న రాయి వల్ల నిప్పు రవ్వలు ఏర్పడి పత్తిపై పడి మంటలు వ్యాపించాయి. గమనించిన మిల్లు నిర్వాహకులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. మిల్లులో పని చేస్తున్న కార్మికులు నీళ్లు చల్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక కేంద్రం మంటలను అదుపులోకి తీసుకు వచ్చింది. ఎనిమిది లక్షల విలువ గల పత్తి కాలిపోయిందని మిల్లు యాజమాని బచ్చు భాస్కర్ తెలిపారు.

కార్గిల్ లేక్‌లో దూకి కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన పల్లె అంజనేయులు (50) అనే భవన నిర్మాణ కార్మికుడి కార్గిల్ లేక్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 9న ఇంట్లో నుంచి వెళ్లిన ఆంజనేయులు సోమవారం కార్గిల్‌లేక్‌లో శవమై తేలాడు. నీటిపై తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కార్గిల్ లేక్ గట్టు వద్ద మృతుడికి సంబంధిచిన టిఫిన్ బాక్స్ మృతుడి జేబులో ఆసుపత్రిలో ట్రీట్మెంట్ పొందిన చీటీ ఆధారంగా ఆంజనేయులుగా గుర్తించారు. ఆంజనేయులు వేములవాడలో భవన నిర్మాణ రంగంలో ఇసుక మోసే పని చేస్తాడు. అతడి భార్య 20 నెలల క్రితమే అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి సంతానం లేదు. ఒంటరి జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడని అంజనేయులు సోదరుడు సాయిలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

పొలాల్లో అగ్నిప్రమాదం



కాలిపోయిన వరి పొలం

శంకరపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజాపూర్ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పంటించడంతో మంటలు కొయ్యని పొలాల్లోకి వ్యాపించి పంట కాలిపోయింది. బాధిత రైతు చింతిరెడ్డి మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం వరి కొయ్యలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఆ మంటలు సమీపంలో ఉన్న కోతకు వచ్చిన మల్లారెడ్డి పదెకరాల పొలంలోకి వ్యాపించి కొంత వరి పైరు దగ్ధమయింది. మల్లారెడ్డి సమాచారం తెలుసుకుని అప్రమత్తమై మంటలు ఆర్పివేశాడు. దీంతో కొంతమేర నష్టం వాటిల్లింది. వరి కొయ్యలకు నిప్పంటించిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత మల్లారెడ్డి కోరారు.

తండ్రిని హత్య చేసిన తనయుడి అరెస్టు

సుల్తానాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తండ్రిని హత్య చేసిన కేసులో తనయుడు తొట్ల తిరుపతి యాదవ్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ మేరకు అతన్ని రిమాండ్ చేయగా కోర్టు ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎస్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణంలోని యాదవనగర్‌కు చెందిన తొట్ల మధునయ్య(71) మధురమ్మ దంపతులకు ఒక కొడుకు తిరుపతితో పాటు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అందరికీ వివాహాలు జరిగాయి. సింగరేణి కార్మికుడిగా పని చేసిన మధురయ్య 13 సంవత్సరాల క్రితం పదవీవిరమణ పొందారు. మధునయ్య పేరిట ఉన్న ఐదెకరాల పదమూడు గుంటల భూమిలో కొడుకు తిరుపతి, కోడలు పేరిట తలా రెండెకరాల భూమిని వారికి రిజిస్ట్రేషన్ చేయించాడు. మిగిలిన ఒక ఎకరం పదమూడు గుంటల భూమితో పాటు మొత్తం భూమిని కొడుకు కోడలు సాగు చేసుకుంటున్నారు. అయితే మధనయ్య వద్ద ఉన్న పదమూడు గుంటల భూమిని తన కూతుళ్లకు ఇద్దామని మధునయ్య మధురమ్మ దంపతులు నిర్ణయించి ఈ విషయాన్ని తన కొడుకు తిరుపతికి చెప్పారు. దానికి తిరుపతి ఒప్పుకోలేదు. ఈ విషయంలో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం కూడా గొడవ కాగా తిరుపతి తన తండ్రి మధునయ్యను కొట్టి చంపాడని ఎస్ఐ వివరించారు. మృతుడు మధునయ్య భార్య ఫిర్యాదు మేరకు తిరుపతి యాదవ్‌పై హత్య కేసు నమోదు చేసి అతడిని సోమవారం అరెస్టు చేశామన్నారు. కోర్టులో హాజరుపరుచగా రిమాండ్ విధించడంతో అతన్ని జైలుకు తరలించామని తెలిపారు.

ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్
ఉషు పోటీలకు స్పందన

● 150 మంది క్రీడాకారుల హాజరు



ఉషు పోటీలను ప్రారంభిస్తున్న ఒలింపిక్ సంఘ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 11: జిల్లా ఉషు అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ ఉషు పోటీలకు విశేషస్పందన లభించింది. ఈ పోటీలకు ఉమ్మడి కరీంనగర్‌లోని రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉషు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోపు సుశాంక్‌రెడ్డి, బార విద్యా సాగర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉషు క్రీడతో విద్యా ర్థులలో శారీరక పటుత్వం పెరుగుతుందన్నారు. క్రీడలతో వివిధ ప్రాంతాల విద్యార్థుల మధ్య స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటుతూ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం బాలబాలికలకు వివిధ కేటగిరీల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు ఫండస్ పాఠశాల యాజమాన్యం అందించిన బహుమతులను జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమి వ్యవస్థాపకులు వికాస్, ఉషు కోచ్ విక్రమ్ గాంధీ, మహేష్, ముఫాజిల్, అఖిల పాల్గొన్నారు.

'మైటా' ఉత్సవాలకు మంత్రి శ్రీధర్‌బాబు


ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్‌టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మలేసియా తెలంగాణ తెలుగు అసోసియేషన్ (మైటా) ఆధ్వర్యంలో మలేసియాలోని కౌలలాంపూర్‌లో మూడురోజుల పాటు జరిగిన మైటా దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, త్రిపుర రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ హాజరయ్యారు. కరీంనగర్ జిల్లాకు చెందిన రెండు తెలుగు రాష్ట్రాల అల్గి ప్రతినిధి ఉప్పుల అంజనీప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. మైటా అధ్యక్షుడు సైదా తిరుపతి, ఆర్గనైజర్ శివంగల రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కళా ప్రదర్శనలు నిర్వహించారని అంజనీప్రసాద్ తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించి గురుకులాల ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మానకొండూర్ మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో సోమవారం జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు, ప్రభుత్వానికి పేరు తీసురావాలని సూచించారు. జోన్ లెవల్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని ఆయన తెలిపారు. అంతకు ముందు జాతీయ పతకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సంయుక్త కార్యదర్శి అనంతలక్ష్మి, తహసీల్దార్ బి రాజేశ్వరి, ఎంఈవో మధుసూదనాచారి, ప్రిన్సిపాల్స్ గోలి జగన్నాథం, లచ్చయ్య, అశోక్‌బాబు, జి అశోక్‌రెడ్డి, వాసు, ఇసాక్, శివప్రసాద్, శేఖర్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు చెందిన 1,190 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

కన్నవారిని విస్మరిస్తే శిక్షార్హులే..

● వృద్ధులకు అండగా పలు చట్టాలు



రాయికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబం కోసం జీవితాన్ని ధారపోశారు. సమాజం కోసం సర్వశక్తులు ఒడ్డారు. జీవిత చరమాంకంలో ఎన్నో ఛీత్కారాలు కష్టనష్టాలు అనుభవిస్తున్నారు. వృద్ధులు వారికి ఉండే హక్కులు, చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన లేకపోవడంతో పలువురు తమ సమస్యల పరిష్కారం కోసం ఠాణామెట్లు ఎక్కుతున్నారు. వృద్ధులకు ప్రభుత్వం, పోలీసులు అందిస్తున్న చట్టాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేకకథనం.. తల్లిదండ్రుల పోషణను విస్మరిస్తే వారిని శిక్షించేందుకు చట్టాలు ఉన్నాయి. వృద్ధులను పట్టించుకోకుంటే వారికి చట్టం అండగా ఉంటుంది. చట్టం పరిధిలో వారికున్న హక్కులు ఏంటో తెలుసుకుందాం..

● వేధింపుల నుంచి రక్షణ కోసం జాతీయ వయోశ్రీ యోజన..

వృద్ధుల్లో 50 శాతానికి పైగా వేధింపులకు గురవుతున్నట్లుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం వృద్ధుల కోసం పలు చట్టాలు రూపొందించింది. కుమారులు, కోడళ్లు ఇతర బంధువుల దూషణలు, చిత్రహింసలతో ఇబ్బంది పడేవారి కోసం జాతీయ వయోశ్రీ యోజన పేరిట పథకాన్ని ప్రవేశపెట్టింది. వృద్ధుల్లో అధికశాతం వైకల్యాలు ఇతర వ్యాధులతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నవారే ఉన్నారు. మలిదశలో ఆసరాగా నిలవాల్సిన పిల్లలు కన్నవారిని ఆశ్రమాలు, ఇతర చోట్లలో చేరుస్తున్న ఘటనలు కోకొల్లలు. దీంతో వృద్ధులకు ఒంటరితనం శాపంగా మారింది. సామాజిక భద్రత పథకాలు వారికి ఉపయోగపడటం లేదు. అందుకే మన దేశంలో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ కోసం 2007లో కేంద్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, పెద్దల పోషణ కోసం సంక్షేమ చట్టం తెచ్చినా దీనిని అమలు చేయడం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఆధారపడి ఉంది.

● ప్రభుత్వ నుంచి ఇచ్చే రక్షణలు

1999 జనవరి 13 జాతీయ వృద్ధుల పాలసీని ప్రభుత్వం ఆమోదించింది. సంక్షేమ చర్యలను వేగవంతం చేయడానికి వృద్ధులకు ప్రయోజనం కలిగించడంలో సాధికారికత కల్పించడానికి ఏర్పాటు చేశారు. అసంఘటిత రంగంలో పనిచేసే వారికి భద్రత కల్పించడానికి పెన్షన్ ఫండ్ ఏర్పాటు, వృద్ధుల కోం వసతి గృహాలు, సంరక్షణ కేంద్రాల ఏర్పాటు చేస్తోంది. సెక్షన్ 88-బి-88 డి, 88-డి, డిబి ఆదాయ పన్ను చట్టం ప్రకారం వృద్ధులకు పన్ను తగ్గింపు ఉంది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వృద్ధుల ప్రయోజనం కోసం అనేక పథకాలు అందిస్తోంది. జీవనధార యోజన, జీవన్ అక్షయ్ యోజన, సీనియర్ సిటిజన్ యూనిట్ యోజనా, మెడికల్ ఇన్సూరెన్స్ అందిస్తోంది.

● సీనియర్ సిటిజన్ మెయింటనెన్స్ చట్టం

ఇది 2007లో అమలైంది. ఈచట్టం ప్రకారం వయోవృద్ధుల రక్షణతోపాటు నెలసరి జీవన భృతి అందిస్తారు.. దీనికి ఆర్డీవో మేజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తారు. బాధితులు ఆర్డీవోకు ఫిర్యాదు చేసుకుంటే వారి కుమారులవద్ద నుంచి జీవనభృతి కల్పించే అవకాశం ఉంది. అడప్షన్ మెయింటనెన్స్ చట్టం 1956లో అమల్లోకి తెచ్చారు. ఈ చట్టం ప్రకారం సెక్షన్30 కింద కుమారులు, కూతుళ్లకు సైతం వర్తిస్తుంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ చట్టం కింద 1973 సెక్షన్ 125 సీఆర్‌పీసీ ప్రకారం కోర్టులో కేసు వేసుకునే అవకాశం ఉంది. బాధితుల కుమారులు, కూతుళ్ల ఆర్థిక స్తోమత బట్టి వారినుంచి జీవనభృతి కల్పించే విధంగా చట్టాలు చెబుతున్నాయి. డెయోస్టిక్ వాలంటెన్స్ చట్టం ప్రకారం సైతం వృద్ధులకు కోర్టులో కేసు వేసుకునే వీలుంది.



జాతీయ స్థాయి అర్చరీ పోటీలకు ఎంపిక


పార్థు

కోల్‌సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రామ గుండం పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ కుమా రుడు టి పార్థుశ్రీకృష్ణ జాతీయస్థాయి అర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. తేజస్ డిఫెన్స్ అకా డమీ కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ గేమ్స్‌లో అర్చరీ అండర్-19 కాంపౌండ్ బోలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. నవంబరు 14 నుంచి 16 వరకు గుజరాత్‌లోని నడియాడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పార్థు ఎంపికయ్యాడు. తన కుమారుడు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా ఉత్తమ ప్రదర్శన చేసి దేశం తరఫున కూడా ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటు న్నట్టు ప్రవీణ్‌కుమార్, కోచ్ శ్రీనివాస్ తెలిపారు.

ఎస్‌యూ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా కిషోర్


ఎస్‌యూ రిజిస్ట్రార్ వరప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్

గణేశ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవి ద్యాలయం పరిపాలన విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా వై.కిషోర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన శాతవాహన ఫార్మసీ కళాశాలలో విధులు నిర్వహించారు. విధుల్లో చేరిన అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు పలువురు అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అసమానతలకు వ్యతిరేకంగా రంగవల్లి పోరాటం


అభివాదం చేస్తున్న విమలక్క, ప్రొఫెసర్ కాసీం తదితరులు

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప మహిళరంగవల్లి అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రంగవల్లి వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి నందికమాన్ సమీపంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన కేంద్రాన్ని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రంగవల్లి విజ్ఞాన కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటు చేశారన్నారు. ఆదివాసీ బిడ్డలకు అండగా నిలిచారని గుర్తు చేశారు.

ప్రజల పక్షాన పోరాడిన వీర వనిత రంగవల్లి

గొప్ప కుటుంబంలో పుట్టి ప్రజల పక్షాన పోరాటం చేసిన వీర వనిత రంగవల్లి అని ఉస్మానియ యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసీం అన్నారు. విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడిన ప్రతీ ఒక్కరు అమరత్వం పొందారన్నారు. సాయుధ పోరాటంలో ఉద్యమించిన రంగవల్లిని ఎన్‌కౌంటర్ చేయడం హేయమైన చర్యన్నారు. పోలీసులు పట్టుకున్న తరువాత కోర్టు ఎదుట ఉంచి వారు చేసిన నేరాన్ని విచారించాలని, కానీ ఇద్దరు పురుషులను, మహిళలను ఎన్‌కౌంటర్ చేసి రాజకీయ వాతావరణాన్ని సృష్టించారని గుర్తు చేశారు.

రంగవల్లి నేటి తరానికి స్ఫూర్తిదాయకం

భూస్వామ్య, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిన విప్లవ కెరటం రంగవల్లి అని, ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవంలో భాగంగా ఆమె మాట్లాడారు. నందికమాన్ చౌరస్తాలో అమరుల జ్ఞాపకార్థం స్తూపాన్ని నిర్మించాలని అనుకున్నామని, కొన్ని కారణలతో జరగలేదని అన్నారు. సమాజానికి జ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతోనే విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్‌ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధ వి, స్థానిక కౌన్సిలర్ కళ్యాణి, ప్రముఖ న్యాయవాది భగవంతరెడ్డి ఉన్నారు.

రాజన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

● సుమారు 80 వేల మంది భక్తుల రాక


భక్తులతో కిటకిటలాడుతున్న రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. కార్తీక సోమవారం సందర్భంగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయం కిటకిటలాడింది. ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించిన భక్తులు అనంతరం పార్వతీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కోడె మొక్కు క్యూలైన్‌లోని భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు ఐదుగంటల సమయం పట్టింది. సోమవారం సుమారు 80 వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్తీక సందడి

ధర్మపురి, కోటిలింగాలలో గోదావరి హారతి
వేములవాడ, కొండగట్టులో ప్రత్యేక పూజలు, దీపోత్సవం


రాజన్న ఆలయంలో సామూహిక దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

ధర్మపురి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో రెండవ సోమవారం కార్తీక సందడి నెలకొంది. లక్ష్మీ నృసింహ స్వామి, అను బంధ శ్రీ రామలింగేశ్వ స్వామి, అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. శేషప్ప కళా వేదికపై శృంగేరి ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ డాక్టర్ బాచంపెల్లి సంతోష్‌శర్మ కార్తీక మాసం గురించి సోమవారం పురాణ ప్రవచనం చేశారు.

పదో రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మ పురి వద్ద గోదావరి హారతి పదో రోజు సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, బొజ్జ రమేష్‌శర్మ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోటిలింగాలలో గోదావరి హారతి

వెల్గటూర్, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటిలింగాలలో గోదావరి హారతి కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి మాతకు పూజలు చేసి గోదావరికి హారతినిచ్చారు. కార్తీక మాసంలో శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయంలో నిత్య దీపోత్సవం, ప్రతీ సోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ అర్చకులు తెలిపారు. అర్చకులు నాగ రాజు శర్మ, సంజీవ్ శర్మ భక్తులు పాల్గొన్నారు. సోమవారం సందర్భంగా శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు.

వేములవాడలో సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ కల్చరల్, (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. ఆలయంలోని కళావేదిక ప్రాంగణంలో సోమవారం ఆలయ ఈవో వినోద్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దీపాలను వెలిగించారు. ధర్మపురికి చెందిన నరహరి శాస్త్రీయ సంగీతం భక్తులను ఆకట్టుకుంది. అర్చకులు రాజేశ్వర శర్మ, దుమాల నాగరాజు శర్మ, వెంకటయ్య, ఏఈవో జయకుమారి, సూపరింటెండెంట్ పూజిత, తిరుపతిరావు, పీఆర్వో అశోక్ తదితరులు ఉన్నారు.

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివారం దేవతలకు అర్చనలు చేపట్టారు. రాత్రి ఆలయ అద్దాల మండపం వద్ద లింగాకరంలో దీపాలను వెలిగించి మహాలింగార్చన నిర్వహించారు.

కొండగట్టులో కార్తీక దీపోత్సవం

మల్యాల, (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న కార్తికదీపోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులతో కలిసి ఆగమ పాఠశాల విద్యార్థులు కార్తిక దీపాలు వెలిగించారు. పర్యవేక్షకులు చంద్రశేఖర్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.





ధర్మపురిలో భక్తుల పవిత్ర స్నానాలు, గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళలు, కోటిలింగాల, కొండగట్టులో పూజలు, వేములవాడలో మహాలింగార్చన

న్యూస్ బాక్స్

గణిత టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

సిరిసిల్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సదీశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో నెహ్రూనగర్ పాఠశాలకు చెందిన యాసరవేణి సాయి హర్షిత్, అరుకాల కావ్య, గాజుల నవజీత్ రెండేళ్ల పాటు హాస్టల్ వసతితో కూడిన ఇంటర్మీడియెట్ విద్యను శ్రీచైతన్య కార్పొరేట్ కళాశాలలో చదువుకునే అవకాశాన్ని దక్కించుకున్నారు. ముగ్గురు విద్యార్థులను ప్రధానోపాధ్యాయిని భాగ్యరేఖ అభినందించారు.

జాతీయ విద్యా దినోత్సవం

రుద్రంగి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మౌలానా అబుల్ కలాం జయంతి సందర్భంగా సోమవారం జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎర్రం గంగా నరసయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో పత్తి రైతు ఆత్మహత్య

ఇల్లంతకుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పత్తికుంటపల్లె గ్రామానికి చెందిన బోడ రాజిరెడ్డి (43) అనే పత్తిరైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇల్లంతకుంట మండలంలోని పత్తికుంటపల్లెకు చెందిన రాజిరెడ్డి గతంలో వ్యవసాయంలో నష్టం రావడంతో ఉపాధి కోసం కొంతకాలం విదేశాలకు వెళ్లాడు. అక్కడా కలిసి రాలేదు. రెండు సంవత్సరాలుగా తన కున్న రెండెకరాల్లో పత్తి పంటను సాగుచేస్తున్నాడు. పంట దిగుబడి సరిగా రాకపోవడంతో ఆవేదనకు గురయ్యేవాడు. మరోవైపు ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశాడు. సుమారు రూ.25 లక్షల వరకు అప్పులు పేరుకుపోయాయి. అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో ఆదివారం రాత్రి ఇంటి నుంచి పొలం వద్దకు వెళ్లి పురుగుల కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజావాణికి విన్నపాల వెల్లువ

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విన్నపాలు వెల్లువెత్తాయి. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో వివిధ సమస్యలపై 123 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. పరిష్కారం చూపాపడంతోపాటు అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు.

● వేములవాడ పట్టణానికి చెందిన దివ్యాంగురాలు ముక్తికాంత సరోజన చాలా రోజులుగా నడువలేని స్థితిలో ఉండి ఇబ్బందులు పడుతుండగా ఆమె సమస్యపై కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా స్పందించారు. తక్షణమే ఆమెకు ట్రై సైకిల్ అందజేయాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. మాన్యువల్ ట్రై సైకిల్‌ను, నడిచేందుకు అవసరమైన చేతికర్రలను అందించారు.

● సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయం పరిధిలో చనిపోయిన వ్యక్తి పేరున భూమి లేకున్న ఉన్నట్లుగా తప్పుడు సర్టిఫికెట్‌ను ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని అఖిల పక్షం, జిల్లా పరిరక్షణ కమిటీ నాయకులు రాగుల రాములు, గుంటివేణు, కనుకయ్య సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. గత నెలలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఇంతవరకు స్పందన లేకుండా పోయిందన్నారు. సమగ్రంగా విచారణ జరిపించి న్యాయం చేయాలని వేడుకున్నారు.




అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, పరికరాలు అందిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి

● తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో గీత వృత్తిని చేసుకుంటూ జీవిస్తున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం అందించే గీత కార్మికుల పెన్షన్‌లను ఇవ్వాలని గ్రామానికి చెందిన నందగిరి నర్సయ్య, పెద్ది బాల చంద్రం, బండి శ్రీనివాస్ కలెక్టర్‌కు వినతి పత్రాలను అందజేశారు. మండెపల్లిలో నిరుపేద గౌడ కుటుంబానికి చెందినవారమని, 56 సంవత్సరాలు నిండినాయని పేర్కొన్నారు. పింఛన్ అందించి ఆదుకోవాలని కోరారు.

● సిరిసిల్ల పట్టణంలో రైతు బజార్‌లోనే రైతులు కూరగాయలను అమ్ముకునే విధంగా చర్యలు తీసుకోవాలంటూ శ్రీలక్ష్మీవేంకటేశ్వర పండ్లు, కూరగాయల ఉత్పత్తి, విక్రయదారుల సంక్షేమ సంఘం నాయకులు లక్కిరెడ్డి రాజిరెడ్డి, రోడ్ల దుర్గవ్వ, తడుక సత్యనారాయణ, బత్తుల భూమేష్, కూరపాటి శ్రీశైలం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న పాత మార్కెట్‌లో ఉన్న వ్యాపారులకు మార్కెట్ అలాగే ఉండి రైతులు పండించిన కూరగాయలను విక్రయించుకునేందుకు పట్టణంలోని బతుకమ్మ ఘాట్ వద్ద రూ.5 కోట్లతో రైతుబజార్‌ను నిర్మించారని, ఉదయం పూట రైతులు అక్కడ కూరగాయాలను విక్రయించడంతోపాటు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పాత మార్కెట్‌లో కూరగాయాలను విక్రయిస్తున్నారన్నారు. దానిపై ఆధారపడి జీవిస్తున్న తమకు గిరాకీ లేక ఇబ్బ ందులు పడుతున్నామన్ని, అధికారులు స్పందించాలని కోరారు.

తప్పుతున్న లెక్క

(5వ పేజీ తరువాయి)

కొన్ని చోట్ల ఎన్యూమరేటర్లపై దురుసుగా వ్యవహరిస్తున్నారు. ఎమ్యూనేటర్లు కూడా అవగాహన కల్పించి వివరాలు రాబట్టడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వం కూడా వివరాలు చెప్పాలని బలవంతం చేయవద్దని చెబుతుండడంతో ఎన్యూమరేటర్లు ఇదే అవకాశంగా పూర్తి వివరాలను తీసుకోవడం లేదు.

జిల్లాలో ఇంటి నంబర్ల వారిగా స్టిక్కర్లు

సర్వేకు సంబంధించి సిబ్బందికి అవగాహన లేకపోవడంతో ప్రతీ ఇంటిని గుర్తించే విధంగా స్టిక్కర్లు వేశారు. ఒక ఇంట్లో ఎన్ని కుటుంబాలు ఉంటే అన్ని స్టిక్కర్లు వేయాలని ఆదేశాలు ఉన్నా సిబ్బంది మాత్రం ఇంటి నంబర్ల ఆధారంగానే స్టిక్కర్లు వేశారు. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో కుటుంబాల గణన కూడా లెక్క తప్పిందని భావిస్తున్నారు. అధికారులు హౌస్‌హోల్డ్ లిస్టింగ్ చేపట్టడానికి జిల్లాను బ్లాక్‌లుగా విభజించారు. 1531 బ్లాక్‌లుగా గుర్తించారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 1154 బ్లాక్‌లు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో 377 బ్లాక్‌లుగా విభజించి ఇళ్లకు స్టిక్కర్లు వేశారు. 1,92,432 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. ఇంటి నంబర్ల ప్రకారం స్టిక్కర్లు వేయడంతో ఒక ఇంట్లో మూడు కుటుంబాలు ఉన్నా ఒక కుటుంబంగానే సర్వే జరుగుతుంది. సర్వే కోసం 1333 మంది ఎన్యూమరేటర్లు, 144 మంది సూపర్‌వైజర్లు క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. సర్వే ప్రారంభమై మూడు రోజులు గడుస్తున్నా లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగడం లేదు.

సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరవేయాలి

వేములవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరే విధంగా చూడాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తల దేనని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని 21వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ కార్యాలయాలు ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికలుగా ఉపయోగపడతాయని, 11 మాసాల క్రితం ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిందని, ఆనాటి నుంచి ప్రజా సంక్షేమ ధ్యేయంగా ప్రజా ప్రభుత్వ ముందుకు పోతోందని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాల్ని చేపడుతున్నామని, రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్‌గా ఇస్తే గత పాలకులు అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. జాతీయ ఉపాధి హామీ, గరీబి హటావో, బ్యాంకుల జాతీయకరణ వంటి ఎన్నో కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా అమలు చేసిందని, రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి అనేక పథకాలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కుల గణన కార్యక్రమం దేశ చరిత్రలో ఒక గొప్ప అధ్యాయానికి నాంది పలుకుతుందని,కుల గణన ద్వారా అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

నిబంధనలు పాటించని భవన నిర్మాణంపై చర్యలు

- ఆత్మహత్య చేసుకుంటానని యువకుడి హల్‌చల్

సిరిసిల్ల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ అనుమతులకు భిన్నంగా నిర్మాణం చేపడుతున్న భవనంపై సోమవారం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో భవనం యజమాని కుమారుడు భవనం కూల్చేస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేశాడు. సిరిసిల్ల పట్టణం పెద్దబజార్‌లోని పుల్లూరి సురేష్ నాలుగు అంతస్తుల భవన నిర్మాణం కోసం అనుమతులు తీసుకొని మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టడంతో మున్సిపల్ టీపీవో సాయికృష్ణ, టీపీఎస్ అభినవ్ భవనంను డీమైషన్ చేయడానికి వచ్చారు. దీంతో మున్సిపల్ అధికారులతో భవన యజమాని సురేష్, కుమారుడు శివ, బంధువులు వాగ్వాదానికి దిగారు. భవన యజమాని కుమారుడు శివ భవనం రెండంతస్తుల పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించడంతో అధికారులు ఆగిపోయారు. మున్సిపల్ చైర్ పర్సన్‌కు చెందిన చిత్రబార్ కూడా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని, ఆ భవనాన్ని కూల్చిన తరువాతే తన భవనం కూల్చాలంటూ చిత్ర బార్ భవనం ఫ్లెక్సీతో నిరసన వ్యక్తం చేశాడు. పోలీసులు శివను కిందికి దింపడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది వెళ్లిపోవడంతో గొడవ సద్దుమణిగింది. శివ భవనం దిగి రావడంతో పోలీసులు, జనం ఊపిరి పీల్చుకున్నారు.

పిల్లలకు ఆర్థిక సహాయం

సిరిసిల్ల రూరల్, నవంబరు (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటలో ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న బైరి అమర్, స్రవంతి దంపతుల పిల్లలకు సోమవారం తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీగాధ మైసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుక మహేష్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంకారపు మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరగొండ రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు గుజ్జెతార, అడెపు చంద్రకళ, పత్తిపాక పద్మ తదితరులు పాల్గొన్నారు.

తుర్కపల్లి మానేరు వాగు నుంచి ఇసుకను తీయొద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండలం తుర్కపల్లి గ్రామంలోని మానేరు వాగునుంచి ఇసుకను తీయడంతో తమ పొలాలు దెబ్బతింటున్నాయని గ్రామ రైతులు సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మానేరు వాగులో ఇసుకను తీసుకెళ్లేందుకు వచ్చే ట్రాక్టర్‌లతో వాగు ఒడ్డున ఉన్న తమ పొలాలు దెబ్బతింటున్నాయన్నారు. కలెక్టర్ స్పందించి అనుమతులు ఇవ్వవద్దని కోరారు. కార్యక్రమంలో దేవయ్య నాగరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తంగళ్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని పారిశుధ్య కార్మికుల వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జీవో నంబరు 60 ప్రకారం పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందించాలని, వెంటనే కార్మికుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20 నుంచి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు లింగంపల్లి స్రవంతి, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

చందుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం మల్యాలకు చెందిన మెరుగు లక్ష్మీరాజం అనారోగ్య సమస్యతో బాధపడుతుండగా అత్యవసర చికిత్స కోసం బాధితుడి కుటుంబ సభ్యులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో మాట్లాడి చికిత్స చేయాలని విప్ ఆదేశించారు. ప్రభుత్వం నుంచి వైద్య ఖర్చులకు రూ.2.50 లక్షలు మంజూరు చేయించారు. ఎల్‌వోసీ మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు

సీఐటీయూ నాయకుడు మోర అజయ్ సస్పెన్షన్

తంగళ్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) సీఐటీయూ నాయకుడు మోర అజయ్‌ని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి కోడం రమణ ప్రకటనలో తెలిపారు. అజయ్ కొంతకాలంగా పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

గంభీరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. సముద్ర లింగాపూర్ సమీపాన ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి కాలినడకన వెళ్తుండగా కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో క్షతగాత్రుడిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందినట్టు ఎస్సై శివకుమార్ తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 వరకు ఉంటుందని వెల్లడించారు.

వల్లంపట్లలో బీజేపీ సభ్యత్వ నమోదు

ఇల్లంతకుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామంలో సోమవారం బీజేపీ సభ్యత్వనమోదు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతు బీజేపీ సభ్యత్వాలను తీసుకోవడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన కార్యక్రమాలతో ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు భూమల్ల అనీల్, ఓబీసీ మోర్చ మండల అధ్యక్షుడు కర్ల లక్ష్మన్, దేశిని అంజి తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబాన్ని ఆదుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు పిల్లల పోషణ భారంగా మారిందని, తమ కుటుంబాన్ని ఆదుకోవాలని వేములవాడ పట్టణంలోని కుమ్మరి వీధికి చెందిన సహస్ర కోరింది. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి కన్నీటి పర్యంతమైంది. తన భర్త మల్లేశం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడని, అక్కడ సరైన పనులు దొరకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొంది. దీంతో ఇద్దరు పిల్లలను పోషించడం కష్టంగా మారిందని, ఉపాధిని కల్పించి ఇందిరమ్మ ఇంటిని అందించాలని కోరింది.

మానాల టు ఎల్లారెడ్డిపేట బస్సు ప్రారంభం

రుద్రంగి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలం మానాల నుంచి వీరుని తండా మీదుగా వయా మరిమడ్ల నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వరకు ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు బస్సు ఏర్పాటు చేయాలని గిరిజన తండాల పెద్దమనుషులతో కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. స్పందించిన విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, మానాల వీడీసి చైర్మన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థికి అభినందనలు

సిరిసిల్ల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ బాలుర జూనియర్స్ హ్యాండ్ బాల్ పోటీల్లో రజత పతకం సాధించిన విద్యార్థి దూస ప్రహర్షిత్‌ను సోమవారం పాఠశాల యాజమాన్యం అభినందించింది. సిరిసిల్ల పట్టణం ఇంగ్లీస్ యూనియన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ప్రహర్షిత్ ఈ నెల 8 నుంచి 10 వరకు హుస్నాబాద్‌లో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాలుర హ్యాండ్ బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు నుంచి పాల్గొన్నాడు. ఫైనల్స్‌లో ప్రత్యర్థి జట్టు చేతిలో ఓడి రజిత పతకాన్ని సాధించాడు.ఈ సందర్భంగా ప్రహర్షిత్‌ను పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

తంగళ్లపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం రామన్నపల్లెలో అక్రమంగా నిల్వ చేసిన 12 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఎస్సై రామ్మోహన్ తన సిబ్బందితో కలిసి రామన్నపల్లెలో దాడులు నిర్వహించారు. గంగెద్దుల మల్లయ్య గుడిసెలో నిల్వచేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వచ్చే ఎన్నికల్లో అధికార సాధన దిశగా పార్టీ నిర్మాణం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌వీ సుభాష్

వేములవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వచ్చే శాసనసభ ఎన్నికల నాటికి రాష్ట్రంలో అధికారం సాధించే విధంగా భారతీయ జనతా పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ అన్నారు. బీజేపీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా జిల్లా స్థాయి వర్క్‌షాప్‌ను సోమవారం వేములవాడలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుభాష్ మాట్లాడారు. బీజేపీలో సంస్థగత నిర్మాణం అత్యంత ముఖ్యమైమన్నారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకే మండల, జిల్లా,రాష్ట్ర స్థాయిలో అధ్యక్షులతోపాటు ముఖ్య పదవులను భర్తీ చేస్తామన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రాష్ట్రంలో విశేష స్పందన లభించిందని, రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షలకు పైగా సభ్యత్వాలు నమోదయ్యాయని అన్నారు. జిల్లాలో 55 వేలకు పైగా సభ్యత్వాలు అయినట్లు వెల్లడించారు. రానున్న రోజులలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు గ్రామస్థాయి నుంచి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యకర్తల సమిష్టి కృషి ఫలితంగానే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా బీజేపీ ఎన్నికల ఇంచార్జ్ గోపు బాలరాజు, ఎర్రం మహేష్, కిష్టస్వామి సంటి మహేష్, రేగుల సంతోష్ బాబు, మార్త సత్తయ్య, శీలం రాజు వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామిని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాష్ దర్శించుకున్నారు. వేములవాడకు వచ్చిన ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఏఈవో శ్రీనివాస్ సన్మానించారు.

మూడు రోజులపాటు సెలూన్లు బంద్

వేములవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ కులవృత్తితో సంబంధం లేని వ్యక్తి సెలూన్ ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ వేములవాడలో మూడు రోజులపాటు సెలూన్లను మూసివేసి ఉంచనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు గడ్డం నవీన్ తెలిపారు. వేములవాడలో సోమవారం నాయీ బ్రాహ్మణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కులానికి, వృత్తికి సంబంధం లేని వ్యక్తి కార్పొరేట్ తరహాలో సెలూన్ ఏర్పాటు చేయడం సరి కాదన్నారు. కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి పొట్టగొట్టేందుకు జరుగుతున్న కుట్రలను గమనించాలని, స్థానిక ఎమ్మెల్యే వెంటనే ఈ అంశంలో జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు సారంపల్లి సంతోష్, ఇన్నారం రమేష్, ప్రధాన కార్యదర్శి గంగిపల్లి చిరంజీవి, ఉప కార్యదర్శి అమృతా అనిల్, కో కార్యదర్శి వెలిచాల శ్రీకాంత్, భూమేష్, గడ్డం తిరుపతి, కళ్యాణం లక్ష్మణ్, కోత్వాల్ నరసింహులు, సూత్రం శ్రీనివాస్, గంగిపల్లి రవి, ఇన్నారం మహేష్, గడ్డం రాజు, వెలిచాల శ్రీధర్, కంది సుదర్శన్, తంగడిపల్లి భూమేష్, తంగడపెల్లి శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నిరసన

గంభీరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలో కలెక్టర్, అదనపు కలెక్టర్, రెవెన్యూ సిబ్బందిపై దాడిని ఖండించారు. భూసేకరణ అంశంపై గ్రామసభకు వెళ్లగా, అక్కడి రైతులు దాడి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భూపతి, సిబ్బంది పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ అండ

- పిల్లల పేరిట

రూ.6 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్



బాండ్లను అందజేస్తున్న చక్రపాణి, నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న నేత కార్మిక కుటుంబానికి బీఆర్ఎస్ అండగా నిలిచింది. సిరిసిల్లలోని వెంకంపేటకు చెందిన నేత కార్మికుడు బైరి అమర్, స్రవంతి దంపతులు ఆత్మహత్య చేసుకోగా ఆదివారం వారి ముగ్గురి పిల్లలను, కుటుంబసభ్యులను ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. వారికి అండగా ఉంటామని పార్టీ పక్షాన రూ.6లక్షలు వారి పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని మాట ఇచ్చారు. కేటీఆర్ మాట ప్రకారం.. సోమవారం వెంకంపేటలోని బైరి అమర్ స్రవంతి దంపతుల ముగ్గురు పిల్లలకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు రూ. 2 లక్షల చొప్పున రూ.6 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ దిడ్డి మాదవి, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, సామాజిక ఉద్యమకారుడు బైరి నరేష్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పేరుతో ఆగం

సిరిసిల్ల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బతకమ్మ చీరల పేరుతో సిరిసిల్ల నేతన్నల బతుకులను ఆగం చేశారని, కొంత మంది కోసం తమ స్వార్థ రాజకీయాల కోసం ఒక రకమైన వ్యవస్థను ప్రోత్సహించి అతలాకుతలం చేశారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 119 మంది ఎమ్మెల్యేల్లో నీవు ఒక ఎమ్మెల్యే మాత్రమేనని, కక్ష కట్టి కుటిల బుద్ధి నీకు నీ కుటుంబానికి ఉందని కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. సిరిసిల్లలో వ్యక్తిగత కారణాలతో దంపతుల ఆత్మహత్య మానవ హృదయాలను కలిచివేసిందన్నారు. ముగ్గురు చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం ఆ చిన్నారులకు అండగా ఉండాల్సిన సమయం వచ్చిందన్నారు. కొంతమంది రాజకీయ బీహారులు 20 ఏళ్లుగా సిరిసిల్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, పది సంవత్సరాలు మంత్రి పదవి వెలగబెట్టారని అన్నారు. రూ. 275 కోట్ల బతుకమ్మ చీరల బకాయిలను పెట్టి ఇక్కడి బతుకులను ఆగం చేసిన వ్యక్తి ఎవరంటే కేటీఆర్ అని చెప్పక తప్పదన్నారు. పదేళ్లకాలంలో నేత కార్మిక వర్గం వివక్షకు గురైందన్నారు. కేటీఆర్ ఊసరవల్లిలా రంగులు మారుస్తున్నారని, అధికారంలో ఉన్న సమయంలో ఒకరకంగా అధికారం పోయాక మరోరకంగా కేటీఆర్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. వస్త్ర పరిశ్రమ, కార్మిక వర్గం తమ కాళ్లపై నిలబడే విధంగా ఎందుకు చేయలేక పోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం 11 నెలలు కావస్తుందని, ఈ కాలంలోనే నీవు చేసిన అప్పును మా ప్రభుత్వం తీర్చాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కార్మికులకు, ఆసాములకు యారన్ నేరుగా ఇవ్వాలని యారన్ డిపో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి అధికారుల లెక్కల ప్రకారం 2014లో 10 మంది కార్మికులు, 2015లో 31 మంది, 2016లో 12 మంది, 2017లో తొమ్మిది మంది, 2018లో ముగ్గురు, 2019లో ఏడుగురు, 2020లో ఏడుగురు, 2021లో ఆరుగురు, 2022లో ఐదుగురు, 2023లో ఐదుగురు కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొమ్మిది మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. మీ అభివృద్ధి ఫలాలు ఉన్నటయితే కార్మికుల ఆత్మహత్యలు ఎందుకు ఆగలేదని ప్రశ్నించారు. పది సంవత్సరాల కాలంలో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే ఒక్కసారైన వచ్చి ఒక్క కుటుంబానైన పరామర్శించిన దాఖలాలు ఉన్నాయా అన్నారు. నాడు అధికారంలో లేకపోయిన ఆత్మహత్య చేసుకున్న ప్రతీ కార్మిక కుటుంబాన్ని పరామర్శించామన్నారు. నేడు అధికారంలో తమ పార్టీ ఉండగా కూడా పరామర్శిస్తున్నామన్నారు. పదేళ్లలో ఒక్క బాధిత కుటుం బానికైనా ఎక్స్‌గ్రేషియా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజుగౌడ్, ఉపాధ్యక్షుడు ఖాజా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప, మహిళా జిల్లా అధ్యక్షురాలు వనిత, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు చంద్రకళ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశం, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రవీందర్, మాజీ డైరెక్టర్ శ్రీకాంత్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ జగన్, నాయకులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి